# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-06-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **దేశంలోనే అత్యాధునిక పరిపాలనా కేంద్రంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్న కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి .**
2. **సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ గమ్యస్థానమని పేర్కొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**
3. **సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రాష్ట్రంలో నేరాల నియంత్రణలో పురోగతి సాధించామని తెలిపిన హోం మంత్రి వి.అనిత.**
4. **రొయ్యల మేతకు పారదర్శకమైన ధరల నిర్ణయానికి రాష్ట్రస్థాయి శాశ్వత కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించిన మంత్రి కె.అచ్చెన్నాయుడు.**

==========================

దేశంలోనే అత్యాధునిక పరిపాలనా కేంద్రంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. విజయవాడలో నిర్వహించిన "స్వచ్ఛ భారత్", "చాయ్ పే చర్చ" కార్యక్రమాల్లో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, గత 12 ఏళ్లలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందని అన్నారు. రాజధాని అమరావతి సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం సహకారం అందిస్తోందని కేంద్ర మంత్రి తెలియజేస్తూ..

వాయిస్..30.. సెకన్లు

అనంతరం విజయవాడలోని ఇంద్రకీలాద్రి శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్లను ఆయన దర్శించుకున్నారు.

--------------------------

సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ గమ్యస్థానమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సింగపూర్‌లో నిర్వహించిన 'సెమీకాన్ ఎకోసిస్టమ్' రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించామని తెలిపారు. వేగవంతమైన వాణిజ్య విధానంతో పారిశ్రామిక అనుమతులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. వచ్చే 30 రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించి రాష్ట్ర పారిశ్రామిక విధానాలు, అవకాశాలను

పరిశీలించాలని సింగపూర్ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలికారు.

---------------------------

సింగపూర్‌లో నిర్వహించిన 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అమరావతిని ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, సుస్థిర అభివృద్ధి, అత్యుత్తమ జీవన ప్రమాణాలతో కూడిన ఆధునిక నగరంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 9 ముఖ్యమైన రంగాల అభివృద్ధి ద్వారా పెట్టుబడులను ఆకర్షించి, ఉపాధి అవకాశాలను కల్పించనున్నామని పేర్కొన్నారు. అమరావతిని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా, ప్రపంచ నగరాల సరసన నిలిచే విధంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30..సెకన్లు

---------------------------

మార్కాపురం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు పనులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లాలోని దోర్నాల మండలం కొత్తూరు వద్ద జరుగుతున్న ప్రాజెక్టు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనంలో సొరంగంలోకి వెళ్లిన మంత్రి, 2వ సొరంగంలో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. అలాగే టన్నల్ బోరింగ్ మిషన్ తొలగింపు ప్రక్రియతో పాటు సొరంగం లైనింగ్ పనులను మంత్రి పరిశీలించి, అధికారులు, ఇంజినీర్ల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రాజెక్టు పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

---------------------------

సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్‌ల వినియోగం, సీసీ కెమెరాల వ్యవస్థను విస్తృతంగా ఉపయోగించడం ద్వారా రాష్ట్రంలో నేరాల నియంత్రణలో పురోగతి సాధించామని హోం మంత్రి వి.అనిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి మెరుగుపడిందని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే నేరాల సంఖ్య 14 శాతం కంటే ఎక్కువగా తగ్గిందని వివరించారు. మహిళల చిన్నారుల భద్రతకు శక్తి యాప్ ద్వారా అత్యవసర సేవలు మరింత సమర్థవంతంగా అందుతున్నాయని చెప్పారు.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "యోగాంధ్ర-2026" కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వివిధ జిల్లాల్లో అధికారులు, ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈరోజు పాల్గొని యోగాభ్యాసం చేశారు. ఏలూరు జిల్లాలోని వట్లూరులో జిల్లా అధికారులు, సిబ్బంది సామూహిక యోగ కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలోని గండికోట పర్యాటక క్షేత్రంలో పర్యాటక యోగా ఇతివృత్తంతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ సి. ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని ఆయన సూచించారు.అదేవిధంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని విడవలూరు మండలం రామతీర్థం బీచ్ వద్ద నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో నెల్లూరు లోక్‌సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. ఈ

సందర్భంగా ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ఆక్వా రైతుల ప్రయోజనాల దృష్ట్యా రొయ్యల మేతకు పారదర్శకమైన ధరల నిర్ణయానికి శాశ్వత రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర రొయ్యల మేత పదార్థాల ధరల పర్యవేక్షణ కమిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఆక్వా రంగంలో మేత ధరల నియంత్రణ, పారదర్శకత, నాణ్యత ప్రమాణాల పరిరక్షణే లక్ష్యంగా ఈ కమిటీ పనిచేస్తుందని చెప్పారు. ఆక్వా రైతుల ఉత్పత్తి వ్యయాలను తగ్గించడం, ఆక్వా రంగాన్ని మరింత లాభదాయకంగా తీర్చిదిద్దడం ఈ కమిటీ ప్రధాన లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

---------------------------

దేశంలో మౌలిక సదుపాయాల రంగంలో గత 12 సంవత్సరాల్లో విశేషమైన పురోగతి సాధించామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ పేర్కొన్నారు. “12 ఏళ్ల నవ భారత నిర్మాణం” అంశంపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన ఈ రోజు స్పందిస్తూ, దేశ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు సత్ ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. జాతీయ రహదారుల పరిధి లక్షా 46 వేల 572 కిలోమీటర్లకు పెరిగిందన్నారు. దేశంలో మెట్రో రైలు మార్గాలు ఒక వెయ్యి 155 కిలోమీటర్లకు విస్తరించాయని, గ్రామీణ ప్రాంతాల్లో 7 లక్షల 90 వేల కిలోమీటర్లకు పైగా రహదారులు నిర్మితమైయ్యాయని వివరించారు. మౌలిక సదుపాయాల విస్తరణ ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు అభివృద్ధి ఫలాలు గ్రామీణ ప్రాంతాలకు చేరుతున్నాయని పేర్కొన్నారు.

---------------------------

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు లోయ దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన ‘ఇన్‌స్టాగ్రామబుల్ ల్యాండ్‌స్కేప్’గా గుర్తింపు పొందుతూ ‘ఇండియన్ రూట్స్ – ఎడిటర్స్ ఛాయిస్’ జాతీయ పురస్కారానికి ఎంపికైందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గోవాలో జరిగిన పర్యాటక జాతీయ సదస్సులో ఈ అవార్డును కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా సంబంధిత అధికారిణి పద్మారాణి అందుకున్నారు. దీనిపై మంత్రి కందుల దుర్గేష్ స్పందిస్తూ, ఈ అవార్డు రాష్ట్ర పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల ప్రచార కార్యక్రమాల ఫలితంగానే ఈ జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని తెలిపారు.

======================